# బడ్జెట్ సరదాలు

పొన్నాడ సత్య ప్రకాశరావు



## "డాడీ! డాడీ! ఎగ్జిబిషన్‌కి వెడదాం డాడీ! సుగుణ వాళ్ళు అప్పుడే రెండుసార్లు చూసేసారు డాడీ"

ఆఫీసు నుండి ఇంట్లోకి అడుగు పెట్టగానే కాళ్ళకు చుట్టుకుపోయిన కొడుకు విష్ణు అర్థింపు, వార్నింగ్, రిమైండర్ అది. వాడు ఎల్‌కేజీ చదువుతున్నాడు. వాడిని ప్రేరేపించి నా సమాధానం కోసం చూస్తున్న కూతురు వైదేహి కేసి చూస్తూ అన్నాడు.

"అలాగే! అయితే మీ ఏన్యువల్ ఎగ్జామ్స్ అవ్వాలి... ఇద్దరికి ఫస్ట్ ర్యాంకులు రావాలి. అప్పుడే ఎగ్జిబిషన్"

మౌనంగా తలూపారు ఏమనాలో తెలియక.

"అబ్బబ్బ! ఇంటికి రాగానే మీద పడిపోతారు. కాసేపు ఆడుకొని రండి!" కాఫీ గ్లాసుతో వస్తున్న భార్య మందలింపుకి చిన్నబుచ్చుకొని వీధిలోకి వెళ్ళిపోయారు.

నిజమే! ఎగ్జిబిషన్ వచ్చి నెల రోజులవుతోంది. వచ్చిందని తెలిసినప్పటి నుంచి అడుగుతోంది. తమ్ముడి చేత అడిగిస్తోంది వైదేహి. అది థర్డ్ స్టాండర్డ్ చదువుతోంది. దాని ఫ్రెండ్ సుగుణ అప్పటికే రెండుసార్లు చూసేసిందట. ఎగ్జిబిషన్‌ని సింపుల్‌గా ఎంజాయ్ చెయ్యాలంటే ఓ వంద రూపాయిలు కావాలి. నా పరిస్థితి... చాలని జీతం... తరగని అప్పులు. ఒక ప్రక్క చెల్లి పెళ్ళి కోసం క్రితం సంవత్సరం చేసిన అప్పు ఇంకా తీరలేదు.. ఇప్పుడు దానిని పురిటికి తీసుకురావాలి. ఇంకో నెలలో మళ్ళీ స్కూల్స్ రీ ఓపెనింగ్ ఖర్చులు... అప్పు కోసం మళ్ళీ ప్రయత్నాలు చేస్తున్నాను... దొరకటం లేదు. ఏదో ఒకటి చెప్పి పిల్లలను మభ్య పెడుతున్నాను. వాళ్ల పరీక్షలయి, రిజల్ట్స్ ఇచ్చేసరికి ఇంకో పదిహేను రోజులు పడుతుంది. ఈలోగా రెడీ అవ్వాలి అనుకున్నాను.

* * *

"డాడీ! ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చారు డాడీ! నాదే ఫస్ట్ ర్యాంక్" చెప్పింది వైదేహి. "... నాక్కూడా డాడీ" వంత పలికాడు విష్ణు.

ఇద్దరి కళ్ళలో సంతోషం... ఆశ.

"సరే రేపు సాయంత్రం రెడీగా వుండండి" అనే సరికి ఎంతో ఉత్సాహంతో సుగుణ వాళ్ళ ఇంటికి పరిగెట్టారు చెప్పటానికి.

* * *

చెప్పినట్టుగానే మర్నాడు సాయంత్రం ఎగ్జిబిషన్‌కి బయలుదేరాం. ఆ రోజే ఓ పాత మిత్రుడి దగ్గర కొత్తగా చేసిన అప్పుతో వీలైనంత సింపుల్‌గా ముగించాలన్న ఆశయంతో, పిల్లలను సంతోష పెట్టలేకపోతున్నానన్న బాధతో.. ఏం చేస్తాను?

* * *

ముందు ట్రెయిన్ ఎక్కి అంతా తిరిగాం. ఇంతలో ప్రక్కనే ఒంటె, గుర్రం కనపడ్డాయి. పిల్లని ఎక్కించి తిప్పుతున్నారు. రెండూ ఎక్కుతాం అన్నారు, ఒక్కటే శాంక్షన్ చేశాను. మినీ జూ... మేజిక్ షోలు కనపడ్డాయి. మళ్ళీ ఒక్కటే శాంక్షన్. ఇంకా కేబుల్ కారు, విమానం రకరకాలు... ఏవో ఒకటి, రెండు ఎక్కించాను పర్స్ గట్టిగా పట్టుకొని. ఇంకా అప్పడాలు, మామిడి ముక్కలు, చెరుకురసం వగైరాలు అవుతున్నాయ్. నేను ప్రతిదీ కౌంట్ చేసుకొంటున్నాను, నన్ను నేను తిట్టుకుంటూ...

* * *

ఎగ్జిబిషన్ చివరకు వచ్చాం. ఎదురుగా క్వాలిటీ ఐస్‌క్రీం పార్లర్ కనిపిస్తోంది. చూడగానే "డాడీ... కప్పు క్రీము ఇప్పించవా" అడిగాడు విష్ణు.

"మొన్న బజారుకెళ్ళినప్పుడు అడిగితే ఎగ్జిబిషనులో ఇప్పిస్తానన్నావు కదు డాడీ" పాత బాకీ గుర్తుచేసింది వైదేహి.

అదీ నిజమే! కాని ఇప్పటికే అనుకొన్న బడ్జెట్ దాటిపోయింది. ఇప్పుడు నలుగురం క్రీము తీసుకొంటే మరో ముప్పై దాకా అవుతుంది. ఎగ్జిబిషన్ బయట రూపాయి ఐస్‌ఫ్రూట్ అమ్ముతుంటారు. అవి కొని ఇస్తే సరి అనుకొని "ఐస్‌క్రీం మంచిది కాదు నాన్నా! ఎక్కువ తింటే జలుబు చేస్తుంది. (వాళ్ళు అసలు తినేదే తక్కువ). పళ్ళు పుచ్చిపోతాయ్. బయట ఐస్ ఫ్రూట్ కొంటాను" అని ఒప్పించాను. అవి తింటే ఏం కాదా డాడీ అన్న విష్ణు ప్రశ్నకు నాకే అర్థం కానట్లు తలూపాను. ఇంతలో కాసేపు ఇక్కడ కూర్చుందామండీ అని శ్రీమతి అనడంతో వేరుశనగ పలుకులు కొని కూర్చోబోయేంతలో దూరంగా ఫ్యామిలీతో వస్తున్న మా మేనేజర్ కనపడ్డాడు.

నేను చూడనట్లు తల త్రిప్పకొనేంతలో ఆయన చూడనే చూసాడు. చచ్చానురా భగవంతుడా అనుకొని ఇప్పుడే వస్తానని శ్రీమతితో చెప్పి మా యముని దగ్గరకు వెళ్ళాను.

"నమస్కారం సార్! ఎగ్జిబిషన్ చూడడానికి వచ్చారా" ఓ వెర్రి ప్రశ్న వేశాను.

"అవునోయ్! మా బుజ్జి గాళ్ళు గోల చేస్తుంటేనూ!" అన్నాడు. బుజ్జి గాళ్ళనబడే మినీ బకాసురులకేసి చూసి "బాగా వ్రాసారా పరీక్షలు?" అడిగాను. సమాధానం ఎవరూ చెప్పలేదు కానీ ఆఖరి బకాసురుడు మాత్రం "డాడీ! వనీలా" అన్నాడు ఐస్‌క్రీం స్టాల్ కేసి చూస్తూ. "అలాగేనోయ్! మా వాడికి ఐస్ క్రీం వుంటే ఏమీ అక్కర్లేదోయ్" అన్నాడు మేనేజర్ నా కేసి చూస్తూ. నా బుర్ర పాదరసంలా పనిచెయ్యసాగింది.

నాకు ప్రమోషన్ దగ్గరపడుతోంది. ఈ మేనేజర్ ఫేవరబుల్ రిపోర్ట్ చాలా అవసరం అందుకు. అయితే నాకు, మేనేజర్‌కి మధ్య అంత సత్సంబంధాలు లేవు. సిన్సియర్‌గా పని చేసినంత మాత్రాన సరిపోదు. అతని వ్యక్తిగత పనులు చేసి పెడుతూ ఏవో ముదుపులు, కానుకలు అడపాదడపా సమర్పించే వాళ్ళనే బాగా చూస్తాడు. నేనెప్పుడు అలా చెయ్యనని నా మీద కోపం. అయితే పనిలో పట్టుకోలేక అవకాశం కోసం చూస్తున్నాడని తెలుసు. ప్రమోషన్ వస్తే జీతం మూడు వందల దాకా పెరుగుతుంది. అది ఎంతో అవసరం తనకి. సో... కాకా పట్టడానికే నిర్ణయించుకున్నాను. మా వాళ్ళ వైపు చూశాను. వాళ్ళు అక్కడ జరుగుతున్న కబాడీ గేం చూస్తున్నారు.

"పిల్లలంతేనండీ" అంటూ వాళ్ళని తీసుకొని పార్లర్ వేపు నడిచాను. వాళ్ళందరికీ వనీలా ఆర్డర్ చేశాను నేను అప్పుడే తీసుకున్నానని చెప్పి. వనిలా అయ్యాక టూటీ ఫ్రూటీ అడిగాడు బకాసురుడు. "తప్పు నాన్నా! అంకుల్‌ని అలా అడగొచ్చా" అంది హిడింబిలా వున్న మేనేజర్ పెళ్ళాం.

"దానిదేం వుందండీ!" అంటూ అప్పటికే హిడింబి మాటలకు అలిగిన బకాసురుని బుజ్జగిస్తూ మరో కప్పు అందిస్తూ అప్రయత్నంగా మా వాళ్ళ వేపు చూశాను.

ప్రక్కనే బాంబు పేలినంతగా ఫీలమయ్యాను. ఎప్పుడు వచ్చారో తెలియదు వైదేహి, విష్ణు నన్నే చూస్తున్నారు. వారి కళ్ళల్లో ఎన్నెన్నో ప్రశ్నలు... ఆ కళ్ళలోకి చూడలేక తల వంచుకున్నాను. "వస్తాంవోయ్! ఐస్‌క్రీం బాగుంది" అనేసి మేనేజర్ వెళ్ళిపోయాడు తన ట్రూపుతో. నేను నా పిల్లల కేసి నడిచాను.